క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ఆలూరు రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీ.కాం కంప్యూటర్ అప్లికేషన్ కోర్సు, కంప్యూటర్ అండ్ కామర్స్ సబ్జెక్టులు బోధించడానికి ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులు సంబంధిత సబ్జెక్ట్ పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొంది ఉండాలన్నారు. ఆయా సబ్జెక్టుల్లో నెట్,సెట్‌తో పాటు పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 28వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. 29న ఉదయం 10 గంటలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని వెల్లడించారు.

రిజర్వాయర్ పెండింగ్ పనులు పూర్తి చేయాలి

పత్తికొండ రూరల్ : అసంపూర్తిగా ఉన్న పందికోన రిజర్వాయర్ పనులు వెంటనే పూర్తి చేయాలని కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు మురళీకృష్ణ అన్నారు. సోమవారం క్రిష్ణగిరి మండలం మీదుగా హంద్రీనీవా ప్రధాన కాలువ పరిశీలనతో పాటు పందికోన రిజర్వాయర్‌ను కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పందికోన రిజర్వాయర్ నుండి నిర్దేశించిన 61వేల ఎకరాల ఆయకట్టులో 10 ఏళ్ల గడచినా 25 శాతం ఆయకట్టుకు కూడా నీరందడం లేదన్నారు. ఉన్న కొంత ఆయకట్టుకు కూడా ఎప్పుడు నీరందిస్తారో చెప్పలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందన్నారు. చెరువులు నింపి హంద్రీనీవాకు నికర జలాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. పార్టీ ఆలూరు ఇన్‌చార్జ్ చిప్పగిరి లక్ష్మి నారాయణ, ఆదోని ఇన్‌చార్జ్ ఖాశీంవలి, నాయకులు హర్షవర్ధన్, మహమ్మద్, సాంబ పాల్గొన్నారు.

ఈసీపై చర్యలు తీసుకోవాలి

ఆస్పరి: ఉపాధి హామీ పథకంలో నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తున్న ఈసీ ఖాజా హుసేన్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు నాగేంద్రయ్య, కృష్ణమూర్తి, ఉరుకుందుప్ప, రంగన్న, మహానంది, బజారి, ఓబులేషు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ గీతావాణికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు కాని వారికి భువన్ యాప్‌ను యాడ్ చేస్తూ నిబంధనలను ఉల్లంఘిస్తున్నాడని ఆరోపించారు. ఈసీపై సమగ్రమంగా విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓను కోరారు.

విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్ పంపిణీ

దేవనకొండ: మండలంలోని తెర్నేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించి ఉద్యోగరీత్యా అనేక ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన తెర్నేకల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీఈఏ) నాయకులు 234 మంది పదో తరగతి విద్యార్థులకు సోమవారం రైటింగ్ ప్యాడ్స్‌ను అందజేశారు. ముఖ్య అతిథులుగా న్యాయమూర్తి,జిల్లా వినియోగదారుల సంఘం సభ్యులు నరహరినారాయణరెడ్డి, మాజీ వికారాబాద్ ఎస్పీ నారాయణ పాల్గొన్నారు. సంఘం అధ్యక్షుడు బి.సుధాకర్‌బాబు, ప్రధాన కార్యదర్శి బి.వెంకప్ప, కోశాధికారి యూ.ఎం.రాజశేఖర్, సభ్యులు రిటైర్డ్ ఆర్టీసీ అధికారి సుధాకర్, మాజీ ఎల్ఐసీ అధికారి శేషాద్రిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రికల్ డే



ఎడిసన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రైవేటు ఎలక్ట్రికల్ కార్మికులు

ఆలూరు రూరల్: ప్రముఖ శాస్త్రవేత్త థామస్ అల్వా ఎడిసన్ బల్బును కొనుగొన్న రోజును పురస్కరించుకుని సోమవారం స్థానిక వాసవీ కల్యాణ మండపంలో ప్రైవేటు ఎలక్ట్రికల్ యూనియన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ డే నిర్వహించి జెండాను అవిష్కరించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఏకాంబరం,మండల అధ్యక్షుడు ఖాసీం మాట్లాడారు. అంతకు ముందు థామస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంజి రెడ్డి, రామాంజి,మహబూబ్ బాషా, ఏడుకొండలు, మల్లి,వలి, అగ్రహారం మల్లి పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ మండల కమిటీ ఎన్నిక

పత్తికొండ రూరల్ : స్థానిక చదువుల రామయ్యభవన్‌లో సోమవారం ఏఐవైఎఫ్ మండల నూతన కమిటీ ఎన్నిక జరిగింది. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారుమంచి, జిల్లా అధ్యక్షుడు శ్రీరాములుగౌడ్, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, మండల కార్యదర్శి రాజాసాహెబ్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో మండల అధ్యక్ష, కార్యదర్శులుగా ఉపేంద్ర, అల్తాఫ్, ఉపాధ్యక్షుడుగా మోహన్, సహాయ కార్యదర్శిగా ఇమ్రాన్, కోశాధికారిగా విజయ్‌ను ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు హనుమేష్, పెద్దయ్య, అహ్మద్, దస్తగిరి, రవి పాల్గొన్నారు.

ఈరన్న కుటుంబాన్ని ఆదుకోవాలి

ఆలూరు: ఇటీవల హత్యకు గురైన ఫీల్డ్ అసిస్టెంట్ కురుబ ఈరన్న (45) కుటుంబాన్ని ఉపాధి హామీ పథకం అధికారులు ఆదుకోవాలని కురుబ సంఘం నాయకులు కారు మంచపన్న, బీరప్ప, నాగప్ప, ఈశ్వరప్ప, వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ఈరన్న మృతి చెంది ఐదు రోజులు కావస్తున్నప్పటికీ ఆ శాఖకు చెందిన ఏపీఓ, ఈసీ, ఈసీలు, ఎఫ్ఏలు ఆ కుటుంబాన్ని పరామర్శించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన బెనిఫిట్స్‌ను మంజూరు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బావులను బాగు చేయండి సారూ!

- నూతుల్లో పేరుకుపోతున్న చెత్త
- బోర్లు పాడైతే ఈ నీరే దిక్కు
- వీటిని వినియోగంలోకి తెస్తే నీటి సమస్యకు చెక్



చెత్తా చెదారం నిండిపోయిన గుడిబావి

మద్దికెర : ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకుందాం.. భూమి పడిన ప్రతి చుక్కను ఒడిసి పట్టుకుందామంటూ ప్రభుత్వం ప్రకటనలు చేస్తుంది. ఇందుకు లక్షల రూపాయలు సైతం వెచ్చిస్తోంది. అయితే చేతల్లోకి వచ్చేసరికి.. ఉన్న నీటిని రక్షించుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ప్రజల నీటి అవసరాలు తీర్చేందుకు మన పూర్వీకులు నీటి అవసరాలు తీర్చేందుకు బావులు తవ్వి, అవి కూలిపోకుండా రాతి కట్టడం కట్టించారు. అవి నేటికీ చెక్కుచెదరక పోగా నీటి ఊటతో అలరారుతున్నాయి. ఇప్పటికీ వినియోగానికి పనికి వస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదు. ప్రజలు కూడా ఇంటి వద్దకు వచ్చే కుళాయి నీటికి అలవాటు పడటంతో బావులకు వెళ్లి నీటిని తెచ్చుకునే వారు కరువయ్యారు. దీంతో ఇళ్లల్లోని, వీధుల్లోని చెత్తను బావుల్లో వేస్తున్నారు. క్రమేణా అవి పూడిపోతున్నాయి. మండల కేంద్రంలో దాదాపు 20 వరకు చేదుడు, దిగుడు బావులున్నాయి. అయితే వాటిలో కొన్ని మాత్రమే వాడుకలో ఉన్నాయి. చాలా వాటిలో చెత్తా చెదారం చేరి నీరు కలుషితం కావడంతో వాడటం మానేశారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. కుళాయిలకు నీటిని సరఫరా చేసే బోర్లు మరమ్మతులకు గురైనా, వాటిలో నీరు ఇంకిపోయినా ఈ బావులే పెద్ద దిక్కవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బావులను శుభ్రం చేయించి వినియోగంలోకి తీసుకొస్తే స్థానికులకు పుష్కలంగా నీటిని అందించవచ్చు.

బావుల్లో బ్లీచింగ్ కలుపుతాం



గ్రామంలోని అన్ని బావుల్లో బ్లీచింగ్ పౌడర్ కలిపేందుకు చర్యలు తీసుకుంటున్నాం. బావుల్లోని నీటిని వినియోగించుకుంటే గ్రామంలో కొంత మేర నీటి సమస్యను పరిష్కరించవచ్చు. ప్రజలు చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం. బావుల ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తాం. – శివకుమార్, కార్యదర్శి , మద్దికెర

పంటచేలో భోజనం చేస్తున్న వ్యవసాయ కూలీలు



ముచ్చటిస్తూ.. ముద్ద తింటూ!

ఉదయం 10:30 గంటలు.. అన్నా.. అన్నం తిందాం రా.. అన్న పిలుపు.. రోడ్డుపై వెళ్తున్న ఓ వ్యక్తి కానివ్వన్నా అంటూ సమాధానం.. శనగ పొలంలో దాదాపు పాతిక మంది కూలీలు, రైతులు గుంపుగా కూర్చొని కబుర్లు చెప్పుకుంటూ.. సరదాలు పంచుకుంటూ.. ఒకరినొకరు ముచ్చటించుకుంటూ.. తెచ్చుకున్న సద్ది (క్యారేజీ)ని పంచుకుంటూ.. ఆత్మీయంగా భోజనం చేస్తున్న దృశ్యం అగ్రహారం గ్రామ సమీప పొలాల్లో సోమవారం కనిపించింది. ప్రస్తుతం రబీలో భాగంగా సాగు చేసిన శనగ పైరు చేతికి రావడంతో ఉదయమే ఆరు గంటలకంతా కూలీలు శనగ కట్టె పీకేందుకు పొలాలకు వెళ్తున్నారు. పది గంటలకు అంతా కలిసి భోజనం చేసి.. మధ్యాహ్నం 12:30 గంటల కంతా తిరుగుముఖం పడతారు. – మద్దికెర

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి కృతజ్ఞతలు తెలుపుతున్న కృష్ణగిరి మండల నాయకులు

కృష్ణగిరి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సూచించారు. ఇటీవల పార్టీ పదవులు పొందిన నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన వారు సోమవారం కర్నూలులోని మాజీ ఎమ్మెల్యే స్వగృహంలో ఆమెను, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డిని కృతజ్ఞతలు తెలియజేశారు. పత్తికొండ, కృష్ణగిరి మండలాల కన్వీనర్లుగా ఎంపికైన కారం నాగరాజు, ఆర్‌బీ వెంకటరాముడు, జిల్లా జాయింట్ సెక్రటరీగా ఎంపికైన కటారుకొండ మాధవరావు, నియోజకవర్గ ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడు నారాయణదాసు, రైతు విభాగం అధ్యక్షుడు ఎం.అగ్రహారం కురువ పక్కీరప్ప, ప్రచార విభాగం అధ్యక్షుడు కంబాలపాడు శిగరమాను కృష్ణమూర్తి, ఐటీ విభాగం అధ్యక్షుడు తుగ్గలి చంద్రశేఖర్ రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు చక్రాల సర్పంచ్ పూరి శ్రీరాములు, ఎస్టీ సెల్ విభాగ అధ్యక్షుడు బోడబండ బీమా నాయక్ కలిశారు. ఎస్వీ మోహన్‌రెడ్డి, కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ పార్టీ కోసం పని చేస్తున్న వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. అనంతరం కృష్ణగిరి మండలం నుంచి ఎన్నికైన వారు ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

క్యాన్సర్‌ను ముందే గుర్తిస్తే ముప్పు తప్పించవచ్చు



మాట్లాడుతున్న డాక్టర్ శైలేష్ కుమార్

కృష్ణగిరి: క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే చికిత్స చేయడం తేలికవుతుందని, తద్వారా రోగికి ముప్పు తప్పించవచ్చని రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య (ఆర్‌బీఎస్‌కే) కార్యక్రమ అధికారి డాక్టర్ శైలేష్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సామాజిక ఆరోగ్య అధికారులు, మహిళా ఆరోగ్య కార్యకర్తలతో అసంక్రమిత వ్యాధుల పరీక్షల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళల్లో 18 ఏళ్ల పైబడిన వారందరికీ రొమ్ము, నోటి, గర్భాశయ క్యాన్సర్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఇంటింటి సర్వే చేసి, అనుమానితులకు పరీక్షలు నిర్వహించి, గుర్తించి తగిన చికిత్స తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. నోటి క్యాన్సర్ పుండుగానే మొదలవుతుందని, నిర్లక్ష్యం వహిస్తే ముప్పుగా పరిణమిస్తుందని, ముందుగానే గుర్తించడం తేలికని తద్వారా చికిత్స అందించడం తేలికవుతుందన్నారు. నోటిలోను, పెదవులు, నాలుక చివరి భాగం, చిగుళ్లు, బుగ్గలు వంటి వాటిలో పుండు, ఎరుపు లేదా నోటి లోపల తెల్లగా ఉండే లక్షణాలపై పరీక్షలు చేయాలన్నారు. వైద్యాధికారి వరప్రసాద్, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సేధాకర్, ఎంపీహెచ్‌ఈఓలు గజేంద్రరెడ్డి, సత్యనారాయణ, పీహెచ్ఎన్ అలివేలమ్మ, సూపర్‌వైజర్ పద్మావతి, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి



జీవాలకు నట్టల నివారణ మందులందిస్తున్న కల్లూరు ఏడీ పార్థసారథి

మద్దికెర : పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించి కాపాడుకోవాలని పశువైద్యాధికారి కృష్ణానాయక్ అన్నారు. సోమవారం మండలంలోని బొజ్జనాయునిపేట గ్రామంలో పశువైద్యశిబిరం నిర్వహించి టీకాలు వేశారు.

వెల్దుర్తి: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను రైతులు, గొర్రెలు, మేకలు, పశువుల పెంపకం దారులు ఉపయోగించుకోవాలని గొర్రెల, మేకల పెంపకందారుల సహకార యూనియన్ కర్నూలు జిల్లా అధ్యక్షుడు కురువ అనుగొండ శ్రీనివాసులు సూచించారు. సోమవారం నర్సాపురం గ్రామంలో ఏర్పాటైన శిబిరాన్ని కల్లూరు పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ పార్థసారధితో కలిసి సందర్శించారు. వెల్దుర్తి, పుల్లగుమ్మి పశువైద్యాధికారులు శాంతలత, స్వాతి, వెల్దుర్తి, నరసాపురం, ఎస్ బోయనపల్లె, గోవర్ధనగిరి, రామళ్లకోట గొర్రెల పెంపకందారుల సహకార సంఘం అధ్యక్షులు రాజశేఖర్, ఎల్లరాజు,లక్ష్మన్న, పుల్లయ్య, లింగన్న పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

పత్తికొండ రూరల్ : మండలంలోని దూదేకొండ గ్రామంలో కొత్తపల్లి రోడ్డులో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని ఏఐటీయూసీ తాటూకా సమితి ఆధ్వర్యంలో తహసీల్దారు రమేష్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. సంఘం తాలూకా అధ్యక్షుడు నెట్టికంటయ్య మాట్లాడుతూ అక్కడ నివాసముంటున్న కుటుంబాలకు నాలుగు నెలలైనా నీరందడం లేదన్నారు. జీలజీవన్ మిషన్ కింద శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. రాజప్ప, ఎల్లప్ప, హుసేని, రాజశేఖర్, రఫి పాల్గొన్నారు.

మాట వినకపోతే మట్టుపెడతారా?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆలూరు రూరల్: మండలంలోని అరికెర గ్రామానికి చెందిన ఈరన్న ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు వదులుకోనందుకే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు హతమార్చడం దారుణమని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గిరి, సహాయ కార్యదర్శి చిన్న ఈరన్న అన్నారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పార్టీ మండల అధ్యక్షుడు మల్లికార్జున ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ఈరన్న వైఎస్సార్ సీపీకి చెందిన వ్యక్తి అని ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు వదులుకోవాలని టీడీపీ నాయకులు ఒత్తిడి చేశారన్నారు. మాట వినకపోవడంతో చివరికి ఈరన్నను అడ్డుతొలగిస్తేనే ఆ పోస్టు తమకు దక్కుతుందని ఈనెల 24న విధులకు వెళ్తుండగా ఈరన్నను దారుణంగా హత్య చేశారన్నారు. తమ మాట వినకపోతే ఇదే గతి పడుతుందని హెచ్చరికలు చేయడానికే ఈ దురాగతానికి తెగబడ్డారన్నారు. పెద్దదిక్కును కోల్పోయిన ఆ నిరుపేద కుటుంబానికి కూటమి ప్రభుత్వం రూ.50 లక్షలు పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలు, పాలనపై దృష్టి పెట్టకుండా కేవలం వైఎస్సార్ సీపీ నాయకులను వేధించడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఎంపీటీసీ దేవరాజు, కో-కన్వీనర్ వీరేష్, ఎస్సీ సెల్ తాలుకా అధ్యక్షుడు కిషోర్, విద్యార్థి విభాగం నాయకుడు రాజు, క్రిస్టియన్ మైనార్టీ సెల్ విభాగం నాయకులు తిక్కస్వామి,ఐటీ విభాగం నాయకుడు వరుణ్, నాయకులు ఎల్లప్ప,గుండయ్య, శేఖర్,జీరాగౌడ్, బి.శేఖర్, గజ్జలప్ప, బాబు,మల్లప్ప,సాయి ఉన్నారు.

విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలి

దేవనకొండ: విద్యుత్ పనులు చేసే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని మండల విద్యుత్‌శాఖ ఏఈ రవీంద్రబాబు పేర్కొన్నారు. మండలకేంద్రంలో సోమవారం ప్రైవేట్ ఎలక్ట్రీషన్ ప్లంబింగ్ వర్కర్ యూనియన్ కార్యాలయంలో జాతీయ ఎలక్ట్రీషియన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రవీంద్రబాబు, సీఐ వంశీనాథ్, మాల బండ్లయ్య పాల్గొని మాట్లాడారు. జనవరి 27న థామస్ ఆల్వా ఎడిషన్ ప్రపంచానికి వెలుగునిచ్చి దినంగా పరిగణించుకుని దినోత్సవాన్ని జరుపుకుంటున్నారని చెప్పారు. సంఘం మండలాధ్యక్షుడు అచ్చుకట్ల చాంద్‌బాషా, వైస్ ప్రెసిడెంట్ వీరేష్, జనరల్ సెక్రటరీ పి.రహిమాన్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

హెచ్‌ఎంల సమావేశం

తుగ్గలి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం క్లస్టర్ రీఆర్గనైజేషన్‌పై హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఫౌండేషన్ స్కూల్, బేసిక్ స్కూల్, మోడల్ స్కూల్, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలలో చేపట్టే నూతన విధానలపై ఎంఈవోలు మాలతి, రమా వెంకటేశ్వర్లు వివరించారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్‌ను కొనసాగించాలి

హొళగుంద: ఇంగళదహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్కూల్ కాంప్లెక్స్‌గా కొనసాగించాలని మడ్డిలింగదహళ్లి గ్రామ సర్పంచ్ సర్పంచ్ సుధాకర్ డీఈఓ శ్యాముల్‌పాల్‌ను కోరారు. సోమవారం ఆయన కర్నూలులో డీఈఓను కలిసి సమస్యను వివరించారు. డీఈఓ స్పందిస్తూ.. పాఠశాలను సందర్శించి నివేదిక తీసుకుంటామని చెప్పారన్నారు.

కందుల కొనుగోలు ప్రారంభం



కందుల కొనుగోళ్లు ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

తుగ్గలి : స్థానిక రైతు సేవా కేంద్రంలో సోమవారం కందుల కొనుగోలును అధికారులు, నాయకులు కలిసి ప్రారంభించారు. క్వింటా కందులు రూ.7,550 ప్రకారం కొనుగోలు చేస్తామని మార్క్‌ఫెడ్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు, సర్పంచ్ రవి, ఎంపీటీసీ సభ్యుడు రాజు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు నబిరసూల్, మాజీ ఎంపీపీ కొమ్ము వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, రాతన, జీ.ఎర్రగుడి మాజీ సర్పంచ్‌లు మనోహరచౌదరి, వెంకటస్వామి పాల్గొన్నారు.

మద్దికెర : ప్రభుత్వం కందులకు రూ.7550 మద్దతు ధర ప్రకటించి మార్క్‌ఫెడ్ ద్వారా కందులు కొనుగోలు చేస్తుందని జీఎం రాజు, ఏఓ రవి తెలిపారు. సోమవారం స్థానిక రైతు సేవాకేంద్రం-1 లో కందుల కొనుగోలును ఎంపీపీ అనిత, సర్పంచ్ సుహాసిని ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాలలోని రైతు సేవా కేంద్రాల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల వద్ద నుంచి కందులు కొనుగోలు చేస్తామని చెప్పా రు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజన్న, పంచాయతీ సభ్యులు లక్ష్మినారాయణ, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, వీపీఏలు జాకీర్, ఆనంద్, రాణి పాల్గొన్నారు.

హాలహర్వి: స్థానిక రైతుసేవా కేంద్రంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఏఓ శివశంకర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మద్దతు ధర రూ.7550గా నిర్ణయించారన్నారు. 12 శాతం లోపు తేమ ఉండాలన్నారు.

వెల్దుర్తి: మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోళ్లు మండలంలో సోమవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ఆర్ఎస్‌కే భవనంలో పత్తికొండ ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్ సమక్షంలో ఏఓ అక్బర్‌బాషా ఆధ్వర్యంలో ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న, టీడీపీ నాయకులు బలరాం గౌడ్, జ్ఞానేశ్వర్‌గౌడ్, రమాకాంత్ రెడ్డి, సుధాకర్ గౌడ్ హాజరయ్యారు. అధికారులు మాట్లాడుతూ..ఎకరాకు 5 క్వింటాళ్ల చొప్పున గరిష్టంగా ఒక్కో రైతు నుంచి 100 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేస్తామని మార్క్‌ఫెడ్ కర్నూలు శాఖ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ తేజ వరప్రసాద్ తెలిపారు.

కందులకు మద్దతు ధర పెంచాలి

తుగ్గలి : కందులు క్వింటా రూ.10వేల ధరతో కొనుగోలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముల్లా నబిరసూల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ..ఈ ఏడాది ప్రతికూల వాతావరణంతో కంది పంటతో పాటు అన్ని పంటల దిగుబడులు తగ్గిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. పెట్టుబడులు విపరీతంగా పెరిగి వ్యవసాయం భారంగా మారిందన్నారు. ప్రస్తుత ధరకు విక్రయిస్తే రైతులకు పెట్టుబడులు కూడా వచ్చేలా లేవన్నారు. ప్రభుత్వం క్వింటా రూ.7,550 కాకుండా రూ.10వేలతో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

రబీ కోతలు షురూ..



హార్వెస్టర్ సాయంతో శనగ పంట నూర్పిడి



పంటను నూర్పిడి చేసేందుకు వచ్చిన యంత్రాలు

మండలంలో రబీ పంటల కోతలు ఊపందుకున్నాయి. ఈ సీజన్లో అత్యధికంగా సాగు చేసిన పప్పుశనగ పంట కోతల్లో అన్నదాతలు బిజీగా ఉన్నారు. 20 వేల ఎకరాల్లో పప్పుశనగ, 9 వేల ఎకరాల్లో కంది పంట, 5 వేల ఎకరాల్లో జొన్న పంట సాగైందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. కొందరు రైతులు ఎద్దుల బండ్లలో కట్టెను కల్లాల్లోకి తరలిస్తుండగా.. మరికొందరు పొలాల్లోనే యంత్రాలతో నూర్పిడి చేయిస్తున్నారు. గింజలను గోడౌన్లలో ఉంచుకుంటున్నారు. పంటల నూర్పిడి కోసం ఉత్తరప్రదేశ్, బిహార్ నుంచి దాదాపు 50 యంత్రాలు మద్దికెరకు వచ్చాయి. – మద్దికెర



శనగ కట్టెను పీకుతున్న కూలీలు



కోసి కుప్పగా వేసిన దృశ్యం..



ఎద్దుల బండ్లపై కల్లాల్లోని తరలిస్తున్న దృశ్యం

న్యాయం చేయండి సార్!



ఇన్‌చార్జ్ తహసీల్దార్ నిజాముద్దీన్‌కు వినతి పత్రం ఇచ్చి సమస్యను వివరిస్తున్న మెగ్యానాయక్

హొళగుంద: నెరణికి తండా గ్రామంలో మా పూర్వీకులకు సంబంధించి 1943లో కొనుగోలు ద్వారా వచ్చిన భూమిని మాకిప్పించి న్యాయం చేయాలని ఆ గ్రామానికి చెందిన మెగ్యానాయక్ ఇన్‌చార్జ్ తహసీల్దారు నిజాముద్దీన్‌ను కోరారు. సోమవారం ఆయనను కలిసి భూమికి సంబంధించిన సమస్యను వివరించి వినతి పత్రం అందజేశారు. 322, 323 సర్వే నంబర్లకు సంబంధించి 4.69 ఎకరాలు ఉందని, గతంలో తమ పూర్వీకులు కొనుగోలు చేశారని చెప్పారు. అయితే ఆ భూమికి సంబంధించి ఆన్‌లైన్ అడంగల్, పట్టాదారు పాసు పుస్తకాలు ఇతరుల పేరు మీద ఉన్నాయని విచారణ చేసి మా భూమిని మాకు ఇప్పించి న్యాయం చేయాలని కోరగా.. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని అధికారి హామీనిచ్చారు.